వేరుశనగ సాగుకు సన్నద్ధం

- ఆర్బీకేలకు చేరిన వేరుశనగ విత్తనకాయలు
- అందుబాటులో సబ్సిడీ ఎరువులు
- చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ నమోదు
- నియోజకవర్గంలో 14286 మంది సాగు రైతులు



ఆర్బీకేల్లో చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

గుర్రంకొండ : నియోజకవర్గంలోని రైతులు వేరుశనగ పంట సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఆరు మండలాల పరిధిలోని అన్ని ఆర్బీకేలకు ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల్ని సరఫరా చేసింది. వ్యవసాయశాఖ సిబ్బంది ఆర్బీకేల్లో విత్తనకాయలు అవసరమైన రైతులకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నియోజకవర్గం మొత్తం మీద 14286 మంది రైతులు7852 హెక్టార్లలో ఈ ఏడాది వేరుశగన పంటసాగుకు సన్నద్ధం అవుతున్నారు.

ఆర్బీకేల్లో 7854 క్వింటాళ్ల విత్తన కాయలు సిద్ధం

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశగన పంట సాగుకు కోసం రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనకాయల్ని ప్రభుత్వం ఆర్బీకేలకు ఇప్పటికే సరఫరా చేసింది. అన్ని మండలాల్లోని ఆర్బీకేల్లో గత ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకే ఈ ఎడాది కూడా విత్తనకాయలు సరఫరా చేశారు. జిల్లా కేంద్రం నుంచి ఇప్పటికే వాహనాల ద్వారా ఆర్బీకేలకు విత్తనకాయలు చేరుకొన్నాయి. రైతులకు ఆర్బీకే సిబ్బంది విత్తనకాయల పంపిణీపై సమాచారం అందజేశారు. ఆన్‌లైన నమోదు ప్రక్రియ పూర్తిగా కాగానే విత్తనకాయల పంపిణీ చేపట్టనున్నారు.

వేగంగా ఆన్‌లైన్ నమోదు

ఆర్బీకేల్లో వేరుశనగ విత్తనకాయల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. విత్తనకాయలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలను సంబంధింత ఆర్బీకేలకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అక్కడ ఆర్బీకే సిబ్బంది ఆన్‌లైన్‌లో రైతు ఆధార్ కార్డు నెంబరు నమోదు చేయగానే పొలంకు సంబంధించిన పూర్తి వివరాలు చూపిస్తాయి. అనంతరం రైతుకు అవసరమైన విత్తనకాయల్ని బయోమెట్రిక్ వేయించుకొని అధికారులు రసీదులు ఇస్తున్నారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ప్రస్తుతం రసీదులు పొంది డబ్బులు చెల్లించిన రైతులకు ఐదురోజుల్లోగా విత్తనకాయలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో సబ్సిడీ ఎరువులు

వేరుశనగ పంట సాగుకు అవసరమైన ఎరువులను కూడా ప్రభుత్వం ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచింది. వేరుశనగ విత్తనకాయల కంటే ముందే నియోజక వర్గంలోని అన్ని ఆర్బీకేలకు సబ్సిడీ ఎరువులను సరఫరా చేశారు. యూరియా, పొటాష్ (కాంప్లెక్స్), డీఏపీ, ట్రికోడెర్మా విరిడి మందులను ఇప్పటికే సిద్ధంగా ఉంచారు. పొటాష్, డీఏపీ తప్పనిసరిగా వేరుశనగ పంట సాగు చేసే పంటపొలాలపై చల్లుతారు. ట్రికోధెర్మావిరిడి మందును విత్తన గింజల్లో కలిపి పొలంలో చల్లుతారు. ఈమందు ప్రభావంతో వేరుతొలుచుతో పాటు భూమిలోపల ఉన్న ఇతర పురుగులు వి త్తన గింజల జోలికి రాకుండా ఉంటాయి. వేరుశనగ పంట సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు సబ్సిడీపై ఆర్బీకేల్లో రైతులు పొందవచ్చు. దీంతో అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో వీటిని కొనుగోలు చేసే బెడద రైతులకు తప్పింది.

7852 హెక్టార్లలో వేరుశనగ సాగు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 14826 మంది రైతులు 7852 హెక్టార్లలో వేరుశనగ పంట సాగుకు సన్నద్ధం అవతున్నారు. పడమటి ప్రాంతాల్లో ముఖ్యమైన వర్షాధార పంట వేరుశేనగ కావడం గమనార్హాం. గత ఏడాదితో పోల్చితే అదే స్థాయిలోనే ఈ సీజన్ వేరుశనగ సాగు అవుతుందని రైతులు అంటున్నారు. ఇందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ఆర్బీకేలకు విత్తనకాయల్ని సరఫరా చేసింది. ఈ తరుణంలో వర్షాలు సకాలంలో కురిస్తే పదిరోజుల్లోనే విత్తనాలు వేసే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. 90 శాతం మంది రైతులు యంత్రాల ద్వారా పొలాల్లో విత్తనాలు వేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు.

నియోజకవర్గంలో గత ఏడాది సాగు, విత్తన కాయల పంపిణీ వివరాలు

మండలం	రైతుల సంఖ్య	వితనాల పంపిణీ (మెట్రిక్ క్వింటాళ్లు)	ఆన్‌లైన్ నమోదు (శాతం)
పీలేరు	4215	1805.4	45
గుర్రంకొండ	1633	1218.8	54
వాల్మీకీపురం	2846	1654.1	48
కలికిరి	1739	1094.6	51
కేవిపల్లె	2547	1265.8	49
కలకడ	1306	986.4	46

రైతులకు అందుబాటులో ఉంచాం



ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు చేసే రైతులకు ఆవసరమైన విత్తనకాయల్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాం. విత్తనకాయలతో పాటు ఎరువులు, విత్తనశుద్ధి మందులు కూడా అందుబాటులో ఉంచాం. అలాగే రైతులకు అవసరమైన మేరకు ఎరువులను కూడా పంపిణీ చేసేందకు అన్ని చర్యలు చేపట్టాం. నిర్దేశించిన లక్ష్యం మేరకు వేరుశనగ విత్తనకాయలు ఆర్బీకేలకు సరఫరా చేశాం. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తికాగానే రైతులకు విత్తనకాయల్ని పంపిణీ చేస్తాం.

– వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

క్లుప్తంగా

సబ్సిడీ విత్తన కాయలకు పేర్లు నమోదు చేసుకోండి

కేవీపల్లె : ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తనాలకు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాలకు చేరిన వేరుశనగ విత్తనకాయలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తనాలు, పచ్చిరొట్ట పైరు అయిన జనుము అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్లతో రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

కలికిరి : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ ఎంపికలలో వివిధ కంపెనీలకు గాను 37 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, హెచ్‌ఎల్ మండో ఇండస్ట్రీస్, టీవీఎస్ ఇండేన్ తదితర కంపెనీల ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలలో పాల్గొనగా డీఈఈఈ బ్రాంచ్ నుంచి 29, డీఈసీఈ బ్రాంచ్ నుంచి 6 మంది, మొత్తం 35 మంది గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ఎంపికకాగా, హెచ్‌ఎల్ మండో ఇండస్ట్రీస్, టీవీఎస్ ఇండేన్ కంపెనీలు ఒకొక్కరిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శివరామక్రిష్ణ, సాంబశివారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దివ్యాంగుల బడిబాట సర్వే



దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీ ఆయిషా

పెద్దతిప్పసముద్రం : దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి వారిని ప్రభుత్వ బడిలో చేర్చేందుకు భవిత స్కూల్ ఐఈఆర్పీలు ఆయిషా, ప్రభాకర్ ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-టూ గౌస్‌పీర్‌ల ఆదేశాల మేరకు తాము మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 1 నుంచి 18 ఏళ్ల లోపు వయసు ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరిపించడంతో పాటు భవిత స్కూల్‌లో బుద్ధిమాంద్యత, వినికిడి లోపం, దృష్టి లోపం లాంటి 21 రకాల వైకల్యాలను గుర్తించి పిల్లల తల్లిదండ్రులతో చర్చించి వారిని భవిత స్కూల్లో చేర్చుకుంటామన్నారు. అదే విధంగా ప్రభుత్వం ద్వారా సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా పలు రకాల అలవెన్సులు,పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందిస్తామన్నారు. జూన్ 9 వరకు ఈ సర్వే జరుగుతుందని, పూర్తి వివరాల కోసం ఐఈఆర్పీలు 868848788, 9959764142 నంబర్లను సంప్రదించాలని కోరారు.


క్షయవ్యాధిలేని సమాజమే బీసీజీ టీకా లక్ష్యం



బీసీజీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : క్షయవ్యాధిలేని సమాజమే బీసీజీ టీకా లక్ష్యం అని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కె.దొడ్డిపల్లె సచివాలయం పరిధిలో నికురవపల్లెలో బీసీజీ టీకా సెషన్‌ను తనిఖీ చేసి హాజరైన ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకా ప్రయోజనాలను తెలియజేశారు. ఈ టీకా వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుందని, పెద్దలలో టీబీ నుంచి రక్షణ ఇవ్వడానికి ఎంతో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ సుబ్బరత్న, ఏఎన్‌యం వాణి, సిబ్బంది లక్ష్మీదేవి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రమా

పీలేరు : సారస్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై అభ్యర్థులకు, ఏజెంట్లకు, సిబ్బందికి ఈఆర్‌వో రమా అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక ఆర్‌వో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ నియమ నిబంధనలు, అభ్యర్థులు, ఏజెంట్లు వ్యవహరించాల్సిన పాత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

ఆర్వో హరిప్రసాద్



కౌంటింగ్ ప్రక్రియ గురించి తెలియజేస్తున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : ఎన్నికల కౌంటింగ్ తర్వాత విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, 144 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉంటుంది. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగినట్లుగానే, జూన్ 4న రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అందరూ సహకరించాలన్నారు. కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్ వద్దకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ తప్పనిసరి అని, ఐడీ లేకుండా ఎవ్వరినీ లోనికి అనుమతించేదిలేదన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన 15 మంది అభ్యర్థులు ఈనెల మే 31వ తేదీలోపు కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించి ఆధార్, లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకువచ్చి ఫారం–18ని అందజేసి ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గానికి సంబంధించి, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్లను 175 మందిని గుర్తించి, వారికి ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్(ఈటీపీబీఎస్) ద్వారా బ్యాలెట్ పంపామన్నారు. వీటిని జూన్ 3వ తేదీ సాయంత్రంలోగా అందుకుని, కౌంటింగ్‌లో చేర్చడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఏ టేబుల్ వ్యక్తులు అక్కడే ఉండి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు రిలీవర్ ఉండదన్నారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్ల..19 రౌండ్లతో కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఆర్వో జారీ చేసిన ఐడీ కార్డులు తప్పనిసరి అన్నారు. మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఎన్నికల షెడ్యూల్ ముగిసేంత వరకు 144 సెక్షన్ అమలుతో పాటుగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. నలుగురు వ్యక్తులు ఒకచోట గుమికూడినా, గొడవలకు దిగినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టపాకాయలు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, ప్రశాంతతను భగ్నంచేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్వోలు కే.ప్రమీల, రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లెట్‌షఫీ, కోటూరిఈశ్వర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు మాదినిభాస్కర్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర సందర్భంగా శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతలకు పూలమాలలు వేసి, దుశ్శాలవతో సన్మానించారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి, జాతర మహోత్సవానికి దేవతలను ఆహ్వానిస్తూ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ జ్యోతి వెలిగించి, శేష పోయుట, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉలవదేవర, అమ్మవారి జాగారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మెన్ రాంకుమార్ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, కేశవ రెడ్డి, కువైట్ శంకరాచారి, బలరాం, భాస్కర్, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



బడి ఈడు దివ్యాంగుల పిల్లల నమోదుకు సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీ అనూరాధ

నిమ్మనపల్లె : ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జూన్ 9వ తేదీవరకు భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్‌పీలు అనూరాధ, సురేష్‌లు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జనార్దన్ ఆదేశాల మేరకు.. నిమ్మనపల్లె మండలంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వేలో భవిత సిబ్బంది గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల పైబడిన వారిని పాఠశాలల్లో చేర్పించనున్నట్లు తెలిపారు. బడి ఈడు దివ్యాంగుల పిల్లల నమోదు కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను చైతన్యపరచి పిల్లలను భవిత కేంద్రాలకు రప్పించి అక్కడ విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిమ్మనపల్లె మండలంలో ఎంఈఓలు ఎం.ఆర్.పద్మావతి, కే.నారాయణ ఆధ్వర్యంలో 20 రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన బడిఈడు, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేదుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేత్రపర్వం.. వెంకన్న రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మదనపల్లె సిటీ : ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మదనపల్లెలో శుక్రవారం శ్రీవెంకటేశ్వరుడు రథంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు.అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగుతూ పరవశం చెందారు. కళాబృందాలు, కోలాట బృందాల నృత్య ప్రదర్శనలు ముందు వెళుతూ పట్టణంలో రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రథాన్ని రంగు రంగు పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం వెంకటేశ్వరుడు, అమ్మవార్లను అర్చకస్వాములు ఊరేగింపుగా రథం వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ స్వరాంగ సుందరంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు అమర, బాలాజీ స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. రథం ముందు కంభం పోసి గుమ్మడి కాయతో అర్చకులు దిష్టి తీశారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామికి అభిషేకం, హోమం చేశారు.

వైభవంగా మల్లాలమ్మ తల్లి తిరునాల

పెద్దమండ్యం : మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీలోని రెక్కలకొండలో వెలసిన మల్లాలమ్మ తల్లి తిరునాల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. తిరునాల సందర్భంగా భక్తులు చాందినీబండ్లు కట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పెద్దమండ్యం–గాలివీడు. పెద్దమండ్యం–చిన్నమండ్యం రహదారుల నుండి ఆలయం వరకు తారురోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోయింది. మొలకలపౌర్ణమి సందర్భంగా ముసలికుంట పంచాయతీలోని చదివేవాండ్లపల్లె వద్ద వెలసిన నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శిద్దవరం ఎల్లమ్మ తల్లి తిరునాల వైభవంగా నిర్వహించారు. మొలకలపౌర్ణమి సందర్భంగా ప్రతి పల్లెలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చెన్నకేశవ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న ఉట్లమాను ఉత్సవం



ఉట్లమాను ఎక్కడానికి పోటీపడుతున్న యువకులు

కురబలకోట : మండలంలోని మొలకవారిపల్లెలో మొలకలపౌర్ణమి సందర్భంగా పిలేకి మారెమ్మ తిరునాల గురు, శుక్రవారాల్లో వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి చాందినీ బండ్ల మెరువన అట్టహాసంగా జరిగింది. వివిధ కళాకృతులు పల్లవించాయి. మహిళలు దీలు, బోనాలతో అమ్మవారిని సేవించారు. మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉట్లమాను ఉత్సవం ఆకట్టుకుంది. యువకులు పోటీలు పడి ఉట్లమాను ఎక్కడం కన్నుల పండగలా సాగింది. పరిసర ప్రాంతాల వారు ఆనందించారు. విజేతలకు నగదు బహుమతిని అందజేశారు.

ఘనంగా చీనేపల్లె యల్లమ్మ తిరునాల



చాందినీ బండి

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ చీనేపల్లెలో వెలసిన శ్రీ చిన్నయల్లమ్మ, పెద్దయల్లమ్మ తిరునాల ఘనంగా జరిగింది. అమ్మవార్ల జాతరలో భాగంగా రెండో రోజు శుక్రవారం పలువురు భక్తులకు బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. అలాగే చాందినీ బండ్లులో ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఫ్రెండ్లీ వెల్ఫేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



మదనపల్లె సిటీ : స్థానిక కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టు గంగమ్మకు శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, భవానీప్రసాద్, రంగస్వామి నాయుడు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అత్యవసర సమావేశం

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీకి సంబంధించి శుక్రవారం ఈఓ గురుప్రసాద్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న అకాల మరణం చెందిన సర్పంచ్ ప్రతాప్‌కుమార్ రెడ్డి మృతి పట్ల వార్డు సభ్యులు, అధికారులు సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. అనంతరం తాత్కాలికంగా ఉప సర్పంచ్‌కు చెక్ పవర్ అధికారానికి సంబంధించి తీర్మాణం ప్రవేశ పెట్టగా మెజారిటీ సభ్యుల ఆమోదంలేక పోవడంతో తీర్మానం వీగిపోయింది. దీంతో మరోమారు త్వరలో వార్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ ప్రకటించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరుశురాం తెలిపారు.

వడ్డిపల్లెలో కార్డెన్‌సెర్చ్



వడ్డిపల్లెలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

మదనపల్లె : పట్టణంలోని వడ్డిపల్లెలో నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసి, 35 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీ బాషు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ ప్రసాద రెడ్డి ఆదేశాల మేరకు వడ్డిపల్లెలో ఉదయం కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఈ క్రమంలో వడ్డిపల్లె నెమలినగర్‌కు చెందిన లేట్ వెంకటస్వామి కుమారుడు పి.రమణ(64) కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి, నిందితుడి నుంచి హైవార్డ్స్ చీర్స్ విస్కీ 35 టెట్రాప్యాకెట్లు (6.30ఎం.లీ)ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి, రెండో అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు పంపామన్నారు.

ప్రశాంతంగా పది సప్లిమెంటరీ పరీక్షలు

పీలేరు రూరల్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి తెలిపారు. శుక్రవారం కోటపల్లె జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. 160 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 32 మంది హాజరైనట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.